
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 5 మెదక్
గురువారం 5 సెప్టెంబరు 2024
జిల్లాల వార్తలు



బుంగల బెంగ

చెరువుల నీరు వృథా



రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ చెరువుకు బుంగ పడడంతో వృథాగా పోతున్న నీరు

లింగాపూర్ చెరువుకు బుంగ

రామయంపేట మండల పరిధి ఝాన్సీలింగాపూర్ పెద్ద చెరువుకు బుంగ పడింది. ఇటీవల భారీ వర్షాలతో బుధవారం కట్టకు గండిపడటంతో అటుగా వెళ్లిన రైతులు గమనించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వెనువెంటనే ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో ఘటనా స్థలికి చేరుకున్న అధికార యంత్రాంగం కంకర, మట్టి వేసి మరమ్మత్తులు చేపట్టారు. సత్వరమే చర్యలు చేపట్టడంతో నల్ల చెరువు నీటిని చాలావరకు వృథా పోకుండా అడ్డుకోగలిగారు.

- మొన్న అప్పకుంటకు, అంతకు ముందు చందంపేటకు, పులిచేరికుంటకు గండ్లు
- తాజాగా లింగాపూర్ చెరువుకు బుంగ
- కట్టుకాల్వ పూడుకుపోవడంతో పటేల్‌చెరువుకు చేరని నీరు

పూడుకుపోయిన కట్టుకాల్వ

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అల్లాదుర్గం శివారులోని బట్టికుంట చెరువులోకి సమృద్ధిగా నీరు చేరింది. బట్టికుంట అలుగు జోరుగా పారుతున్న అక్కడి నుంచి పటేల్‌కుంటకు నీరు చేరడం లేదు. కట్టుకాల్వ పూడుకుపోవడంతో నీరంతా వృథాగా పోతున్నది. రోడ్లపై పారుతు పంట పొలాలను ముంచుతున్నది. ప్రతీ వర్షాకాలంలోనూ ఇదే దుస్థితి నెలకొన్నదని, అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పంట మునిగిన బాధిత రైతు కొన్యాల భేతయ్య వాపోయాడు.

చిన్నశంకరంపేట/రామాయంపేట/అల్లాదుర్గం, సెప్టెంబరు 4 : వర్షాకాలం ఆరంభమైన మూడు నెలల తర్వాత భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు జలకళతో కళకళలాడుతున్నాయి. అలుగు పారుతుండడంతో ఓవైపు అన్నదాతల్లో మది ఉప్పొంగుతున్నది. కానీ మరోవైపు ఇరిగేషన్ శాఖ వైఫల్యం కారణంగా చెరువుల నిర్వహణ సరిగ్గా లేక లోపాలు బయటపడుతుండడంతో నీరంతా వృథాగా పోతున్నది. చెరువులకు బుంగలు, గండ్లు పడి, కట్టుకాల్వలు పూడుకుపోయి నీరంతా రోడ్లపై పారుతున్నది. చెరువు పక్కల పంటపొలాలను ముంచుతున్నది.మొన్న వెల్దుర్తి మండలంలోని అప్పకుంటకు బుంగ పడగా, చెరువుల వద్ద నిఘా కొరవడడంతో తూప్రాన్ మండలం ఇస్లాం పెద్దచెరువు ఫీడర్ ఛానెల్‌కు కొందరు గండి పెట్టారు. సోమవారం చిన్నశంకరంపేట మండలం చందంపేట చెరువుకు, రామాయంపేట మండలంలోని తోనిగండ్లలోని పులిచేరికుంటకు బుంగల పడ్డాయి. ఇవి మరువక ముందే బుధవారం మరో రెండు చోట్ల చెరువుల నీరు వృథాగా పోయింది. వానాకాలం ప్రారంభం ముందే చెరువు కట్టల నాణ్యతను పరీక్షించాల్సిన నీటి పారుదల శాఖ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ ముప్పు వాటిల్లుతున్నదని రైతులు మండిపడుతున్నారు.

మరమ్మతు చేసినా..

భారీ వర్షానికి చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట పెద్దచెరువుకు సోమవారం బుంగపడింది. పంచాయతీ కార్యదర్శి అనురాధ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి బుంగ పూడిక కోసం మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. బుంగ నుంచి నీటి వృథా ఆగలేదు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మాజీ సర్పంచ్ లక్ష్మణ్, గ్రామస్థులు కోరుతున్నారు. మండలంలోని శాలిపేటనల్ల చెరువు అలుగుపారుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అల్లాదుర్గంలో పంటను ముంచుతున్న బట్టికుంట చెరువు నీరు

24 గంటల్లో నాలుగు టీఎంసీలు

గరిష్ఠ నీటి మట్టానికి చేరువలో సింగూరు



నీటి మట్టాన్ని సూచిస్తున్న స్కేలు

పుల్‌కల్, సెప్టెంబరు 4 : సింగూరు ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. 24 గంటల వ్యవధిలో దాదాపు నాలుగు టీఎంసీల మేర వరద నీరు చేరిందని ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకు 20.267 టీఎంసీలు ఉండగా, బుధవారం ఉదయం 6 గంటలకు 23.950 టీఎంలకు చేరుకున్నది. సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులో 25.894 టీఎంసీల నీరు ఉన్నది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 523.6 మీటర్లకు 29.917 టీఎంసీలు. 25.894 టీఎంసీల నీరుతో ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 523 మీటర్లకు చేరుకున్నది. ఇన్‌ఫ్లో 44,289 క్యూసెక్కులు నమోదవుతున్నది. నీటిమట్టం గణనీయంగా పెరుగుతుండటంతో నీటి పారుదల ఇంజనీరింగ్ శాఖ అప్రమత్తం అయ్యారు. నేడు లేదా రేపు గేట్లు ఎత్తే అవకాశాలు ఉన్నాయి. గేట్లను ఏ క్షణంలోనైనా ఎత్తనున్న దృష్ట్యా జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. వరద ఉధృతి మరింతగా పెరిగితే రెండు టర్బైయిన్లు చురుకుగా పనిచేసేలా సన్నద్ధం చేశారు.

మంజీర రిజర్వాయర్‌కు తగ్గని ఉధృతి

సంగారెడ్డి మండలం కలబ్‌గూర్ గ్రామ శివారులోని మంజీర రిజర్వాయర్‌లో నీటి ఉధృతి తగ్గలేదు. ఇప్పటికే అధికారులు 2వ నంబరు క్రస్ట్‌గేట్‌ను మూడు మీటర్లు ఎత్తు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లోకి 4,670 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 4,080 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



నిండుకుండలా మంజీర రిజర్వాయర్

నాలుగు రోజులుగా రాజగోపురంలోనే..

పాపన్నపేట, సెప్టెంబర్ 4 : భక్తుల సౌకర్యార్థం ఏడుపాయల ఆలయ రాజగోపురంలోనే వనదుర్గామాత ఉత్సవ విగ్రహానికి బుధవారం పూజలు కొనసాగాయి. ఏడుపాయలకు నాలుగో రోజైన బుధవారం వరద ప్రవాహం కొనసాగింది. బుధవారం తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం మళ్లీ ఆలయాన్ని మూసివేశారు. భక్తులను అనుమతించలేదు. వనదుర్గా (ఘనపురం కట్ట) ప్రాజెక్టు నుంచి 15,155 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తుంది.

వాగులో కొట్టుకుపోయినా వ్యక్తిని కాపాడిన మహేష్‌కి అభినందనలు

టేక్మాల్, సెప్టెంబరు4 : టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండు వాగు మంగళవారం పొంగిపొర్లింది. వాగు వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించగా, అటు నుంచి వెళ్తున్న రామావత్ నందు నీటిలో కొట్టుకపోయి నందు ఓ బండరాయిని పట్టుకుని ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, మెదక్ క్విక్ రెస్పాన్స్ టీం మెంబరు మహేష్, మరో ఇద్దరు సిబ్బందితో వంతెన వద్దకు చేరుకుని తాడు సహాయంతో వాగులో నుంచి నెమ్మదిగా నందును కాపాడారు. ప్రాణాలను పణంగా పెట్టి నందును కాపాడిన మహేష్‌ని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

చెరువులు, కుంటల రక్షణకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్ క్రాంతి



బొల్లారం పర్యటనలో కలెక్టర్

జిన్నారం, సెప్టెంబరు 4 : స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల రక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ, కాజీపల్లి పంచాయతీ పరిధిలో బుధవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కాజీపల్లి జీఎంఆర్ కాలనీని సందర్శించి మౌలిక వసతులు, సమస్యలను తెలుసుకున్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని మోడల్ పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. తర్వాత మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, డీఎంహెచ్‌వో గాయత్రిదేవి, కమిషనర్ మంగతాయారుతో కలిసి మాధవానికుంటను సందర్శించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా, సీహెచ్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాల సీజన్‌లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఇరిగేషన్ డీఈ రామస్వామి, ఆర్ జయప్రకాష్, నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి అహ్మద్‌నగర్‌లో ఓ షాపులో చేరిన వర్షం నీరు

భారీ వర్షంతో ఇళ్లలోకి చేరిన వరద నీరు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 4 : సంగారెడ్డిలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని అహ్మద్‌నగర్‌లో పలు ఇళ్లలోకి, షాపుల్లోకి వరద నీరు చేరింది. ఇళ్లలోని వస్తువులు, బియ్యం ఇతరత్రా వస్తువులు తడిసి ముద్దయ్యాయి. ఇళ్లలో చేరుకున్న వర్షపు నీటిని మగ్గులతో బయటికి తోడేశారు. భారీ వర్షంతో నీరంతా ఇళ్లలోకి చేరడంతో రాత్రి జాగారం చేస్తూ చిన్న పిల్లలతో సహా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం

పాఠశాల విషయంలో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఇదివరకు డీఈవోకు వివరించాం. హాస్టల్‌గడ్డలోని వసతిగృహంలో ఏర్పాటు చేయాలని సూచించారు. హాస్టల్ వారు ఒప్పుకోవడం లేదని ఉపాధ్యాయులు చెప్పగా తాము మాట్లాడి ఒప్పించాం. పాఠశాల సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– వెంకటనర్సింహగౌడ్, ఎంఈవో, సంగారెడ్డి

చింతపల్లి బడికి దారేది?

వాగు ప్రవాహంతో వెళ్లలేని దుస్థితి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 4 : సంగారెడ్డి మండలం చింతపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను వాగు నీటి ప్రవాహం చుట్టుముట్టింది. అసలే పాఠశాలకు వెళ్లేందుకు దారి లేదు.. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పక్కనే ఉన్న వాగు పొంగింది. ఈ వాగు నీటి ప్రవాహాన్ని దాటి బడిలోకి వెళ్లాల్సి వస్తుంది. ఈ బడిలో ఇంగ్లిష్ మీడియంలో 30 మంది, ఉర్దూ మీడియంలో 15 మంది, మొత్తం 45 మంది విద్యార్థులు ఉన్నారు. చింతపల్లి గ్రామ పంచాయతీని సంగారెడ్డి మున్సిపాలిటీలో విలీనం చేయడంతో మండల అధికారులు ఈ బడిని పట్టించుకోవడం లేదు. ఇంకా తమ పరిధిలోకి రాలేదంటూ మున్సిపాలిటీ నిర్లక్ష్యం చూపుతుంది. పాఠశాలకు ఎప్పటికైనా ముప్పు వాటిల్లుతుందని ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి బడిని ఇతర ప్రాంతానికి మార్చాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





చింతలపల్లి బడి దారిలో వాగు నీరు, స్కూలుకు వెళ్లలేక చిన్నారును తిరిగి తీసుకెళుతున్న తండ్రి

రహదారుల వెంట ట్రామా సెంటర్లు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

మెదక్, సెప్టెంబరు 4 : రహదారులపై ప్రమాదాలు సంభవిస్తే క్షతగాత్రులకు వెంటనే వైద్యసహాయం అందించేందుకు ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ రోగుల కోసం జిల్లా వ్యాప్తంగా డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు. జిల్లా ఆసుపత్రిలో బెడ్లు రెట్టింపు చేస్తామన్నారు. నూతనంగా ఏర్పడ్డ మండల కేంద్రాల్లో పీహెచ్‌సీలను నెలకొల్పాలని ఆదేశించారు. భూసమస్యల పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయించాలన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పథకం వర్తిస్తుందని మంత్రి స్పష్టంచేశారు. రుణమాఫీకి ఎదురవుతున్న సమస్యలను నోట్ రూపంలో అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌ను ఆయన ఆదేశించారు.

మెడికల్ కళాశాల ఏర్పాటుకు అన్ని వసతులు

మెదక్ పట్టణంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు అన్ని వసతులు ఉన్నాయని, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు ప్రభుత్వం తరపున అప్పీల్‌చేశామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం మెదక్‌లో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన మాట్లాడారు. విద్యా, వైద్య రంగాలకు నిధులు కేటాయించడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. సర్కార్ దవాఖాన వైద్యంపై నమ్మకం కల్పించేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇందుకోసం విద్యా వైద్యంపై కలెక్టర్ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. కలెక్టర్ వైద్య శాఖపై చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివదయాళ్‌ను ఆదేశించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు సన్న బియ్యం భోజనంతో పాటు, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించి ప్రోత్సహించాలన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ పెండింగ్ భవనాలు, రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు ఇచ్చిన సూచనలు పాటిస్తూ జిల్లాను ప్రగతిపథంలో నడుపుతామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి, మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

హైడ్రా కమిషనర్ నాకు తెలుసు..

- నిర్మాణాల జోలికి రాకుండా చూస్తా!
- ప్రాజెక్టు నిర్వాహకులకు బెదిరింపు
- రూ.16 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- అమీన్‌పూర్‌లో ఓ వ్యక్తి ఘరానా మోసం
- రూ.2 లక్షలు తీసుకుంటుండగా..
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు
- ఎవరైనా బెదిరిస్తే 8712656777కు
- ఫిర్యాదు చేయాలన్న సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 4: 'మీరు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. హైడ్రా కమిషనర్ నాకు బాగా తెలుసు. డబ్బులిస్తే మీ నిర్మాణాన్ని కూల్చకుండా చూస్తా. లేదంటే కూల్చేస్తారు' అంటూ విప్లవ్ సిన్హా అమీన్‌పూర్‌లోని కొందరు ఇళ్ల యజమానులు, బిల్డర్లను బెదిరిస్తున్నాడు. చెరువులు, కుంటల సమీపంలో, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టిన వారే లక్ష్యంగా వసూళ్ల దందాకు తెర తీశాడు. అతన్ని సంగారెడ్డి జిల్లా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసు వివరాలను సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ బుధవారం విలేకరులకు తెలియజేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన బండ్ల విప్లవ్ సిన్హా(42) ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తూ అమీన్‌పూర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. విలాసవంతమైన జీవితం గడపాలనే దురాశతో ఇళ్ల నిర్మాణాలు, స్థలాలు.. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోకి వస్తాయని పలువురిని బెదిరించి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించాడు. తాను సోషల్ వర్కర్‌నని, మీడియాలో రాయిస్తానని బిల్డర్లను బెదిరించేవాడు. అయితే అమీన్‌పూర్ చెరువు నుంచి వచ్చే నాలాకు ఆనుకొని ఒక పెద్ద నిర్మాణ సంస్థ విల్లాలు నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు అక్రమంగా నిర్మిస్తున్నారంటూ వారిని బెదిరించాడు. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ అమీన్‌పూర్ వచ్చి వెళ్లిన తర్వాత రోజు రాత్రి విప్లవ్ సిన్హా ప్రాజెక్టు నిర్వాహకుడు రాజేంద్రనాథ్‌కు వాట్సాప్ కాల్ చేయగా మరుసటి రోజు కలుస్తానని చెప్పారు. అప్పుడు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో దిగిన ఫొటోలు చూపించిన విప్లవ్.. ఆయన తనకు చాలా దగ్గరని, మీ ప్రాజెక్టు జోలికి రాకుండా ఉండాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చివరకు రూ.16 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. తర్వాత గచ్చిబౌలిలోని ఓ కాఫీ షాప్‌లో కలిసి మళ్లీ బెదిరించాడు. అయితే ఈ నెల 3న రాజేంద్రనాథ్, మంజునాథ్‌రెడ్డి మరో ఇద్దరితో కలిసి విప్లవ్ సిన్హా ఇంటికి వెళ్లి రూ.2 లక్షలు ఇస్తుండగా డెకాయ్ ఆపరేషన్‌లో ఉన్న టాస్క్‌ఫోర్స్, అమీన్‌పూర్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు విప్లవ్ సిన్హా

బెదిరిస్తే 8712656777కు ఫిర్యాదు చేయండి: ఎస్పీ

ఎవరైనా హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడితే వారి సమాచారాన్ని 8712656777కు కాల్ లేదా వాట్సాప్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ రూపేశ్ కోరారు. ఏసీబీ అధికారులు, పోలీసుల పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడిన వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బెస్ట్ టీచర్లు

- సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర స్థాయికి ఇద్దరి ఎంపిక
- ముగ్గురికి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా నుంచి ఇద్దరిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, ముగ్గురిని రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులు వరించాయి. ఆర్‌సీపురం మండలం తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు టి.భాస్కర్‌తో పాటు అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ ఎంపీపీఎస్ ఎస్జీటీ ఉపాధ్యాయురాలు కె.నాగేశ్వరి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన అర్థశాస్త్ర అధ్యాపకుడు డా.జగదీశ్వర్, ప్రభుత్వ పాలన అధ్యాపకురాలు డా.వి.మల్లిక, జీవశాస్త్ర అధ్యాపకుడు డా.మిథున్‌రాథోడ్ ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందనున్నారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో వీరు అవార్డులు అందుకోనున్నారు. సంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. డీఈవో వెంకటేశ్వర్లు 121 మందితో కూడిన జాబితాను వెల్లడించారు. వీరికి గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో మధ్యాహ్నం నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పురస్కారాలు అందజేయనున్నారు.

మెదక్ జిల్లాలో 54 మంది

మెదక్ అర్బన్, సెప్టెంబరు 4: మెదక్ జిల్లాలో 54 మంది టీచర్లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం డీఈవో రాధాకిషన్ ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో పేర్లు వెల్లడించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

కొలత తగ్గితే కొరడా

- తూనికలు, కొలతల్లో అక్రమాలపై ఉక్కుపాదం
- జిల్లాలో 'లీగల్ మెట్రాలజీ' అధికారుల తనిఖీలు
- అక్రమాలు గుర్తిస్తే కేసుల నమోదు
- పెట్రోల్ బంకుల్లో మోసాలపై చర్యలు
- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే కేసు, జరిమానా

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4 : ప్రజలు నిత్యం వస్తు సేవలపై ఆధారపడుతున్నారు. ఉదయం లేచింది మొదలు ప్రతీది కొనుగోలు చేయాల్సిందే. నిత్యవసరాలైన పప్పులు, ఉప్పులు మొదలు తదితర అన్నీ కొనుగోలు చేస్తుంటారు. అయితే మనం కొనుగోలు చేసిన వస్తువు నాణ్యంగా ఉన్నదా.. కొలతలు సరిగా ఉన్నాయా అంటే అనుమానమే. నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉండని వస్తువులు వినియోగదారుడికి దొరకనప్పుడు ఏం చేయాలి, ఎవరిని ప్రశ్నించాలి. పెట్టిన డబ్బుకు ఆశించిన ఫలితం అందలేదని ఊరుకోవాలా? ధనం వృథా అయ్యిందని మిన్నకుండాలా? అవసరం లేదు. లీగల్ మెట్రాలజీ అధికారులకు ఒక్క ఫిర్యాదు చేస్తే చాలు చర్యలు తీసుకుంటారు.

ముమ్మర తనిఖీలు

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. తక్కువ తూకం, తక్కువ కొలతలు వేస్తూ వస్తువులపై ముద్రించిన ధరలకు మించి విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కేసులతో పాటు రూ.5 వేల నుంచి రూ. 25 వేల వరకు జరిమానాలు విధిస్తున్నారు. ప్రజలు మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వినియోగదారులకు తగు సూచనలు చేస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి చర్యలు తీసుకుంటున్నారు.



ఓ మార్ట్‌లో ఎలక్ట్రానిక్ కాంటాను పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి(ఫైల్)

ప్రామాణిక ముద్రలు వేసుకోవాల్సిందే

తూనిక రాళ్లకు ప్రతి రెండేళ్లకోసారి తూనికలు, కొలతల శాఖ నుంచి ప్రామాణిక ముద్రలు వేయించుకోవాలి. ఇందుకు కొంత నగదును తూనికలు, కొలతల శాఖకు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అదే ఎలక్ట్రానిక్ కాంటా అయితే ఏడాదికి ఒక తనిఖీలు చేయించుకొని స్టాంపులు వేయించుకోవాలి. అయితే చాలా మంది వ్యాపారులు ప్రామాణిక ముద్రలు వేయించుకోవడం లేదని తెలుస్తోంది. పలు చోట్ల తోపుడు, కూరగాయల మార్కెట్లు, కిరాణా వ్యాపారుల్లో ఇప్పటికీ ఇంకా పాత పద్ధతిలోనే విక్రయిస్తున్నారు. అయితే వ్యాపారులు వినియోగించే తూనికలు, కొలతల యంత్రాలపై తప్పనిసరిగా ప్రామాణిక ముద్రలు వేయించుకోవాలని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

కేసుల వివరాలు

సంవత్సరం	తనిఖీలు	కేసులు	జరిమానా(రూ.)	స్టాంపింగ్ ఆదాయం(రూ.)
2020-21	2,210	161	4,28,000	1,15,89,278
2021-22	3,100	329	17,23,625	1,53,32,431
2022-23	2,535	162	11,42,000	1,20,26,931
2023-24	7,008	167	11,70,000	1,21,25,940
2024-25(ఆగస్టు)	2,165	78	5,45,000	40,43,120

తూనికలు, కొలతల్లో మోసాలు సహించేది లేదు



తూనికలు, కొలతల్లో మోసాలు అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు మోసాలకు గురికాకుండా జిల్లా లీగల్ మెట్రాలజీ చర్యలు తీసుకుంటుంది. వ్యాపారులు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాంటా, తూనికరాళ్లపై కచ్చితంగా అధికారిక ముద్రలు వేసుకోవాలి. ముఖ్యంగా పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోల్ పోసుకునే ముందు తప్పనిసరిగా జీరో పాయింట్‌ను చూసిన తర్వాతే పెట్రోల్ పోయించుకోవాలి. ఎమ్మార్పీ కంటే ఏ వస్తువు ఎక్కువ ధరకు అమ్మరాదు.

– ఎం.అనిల్‌కుమార్, తూనికలు కొలతల శాఖ అధికారి, సంగారెడ్డి జిల్లా

నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు

పెట్రోల్‌బంక్‌లో కొలతలు, వేబ్రిడ్జి, రేషన్‌షాప్, రిటేల్, హోల్‌సేల్, కిరాణ, మాంసం తూకాల్లో తూనికల్లో తేడాలుంటే ఫిర్యాదు చేయొచ్చు. ప్రతీ ప్యాకెజ్డ్ ఐటెమ్‌పై ఎమ్మార్పీ, డేట్ ఆఫ్ ప్యాకింగ్, అడ్రస్, కన్స్యూమర్ కేర్ నంబర్ ఉన్న ప్యాకేజీల ఐటెమ్‌లనే విక్రయించాలి. కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు వినియోగదారుడు బిల్లు తీసుకోవాలి. వీటిలో ఏ విధంగా మోసపోయినా టోల్ ఫ్రీ నంబరు 180042500333, 8523011449 నంబర్లకు ఫిర్యాదు చేయొచ్చు.



సర్కారు బడి..

- తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు
- వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో..
- ఒక్కస్కూల్‌లోనే 58 మంది పిల్లలు
- ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న సార్లు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 4 : "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ".. అని తల్లిదండ్రుల తర్వాత స్థానమిచ్చి గురువును గౌరవిస్తాం. అజ్ఞాన పొరలను తొలగించి జ్ఞానదీప్తిని వెలిగించేవాడే ఆచార్యుడు. దేవుడు, గురువు పక్కపక్కన నిలుచుంటే నేను గురువుకే నమస్కరిస్తానన్నారు కబీర్ దాస్. ఎందుకంటే తనకు ఆయన భగవంతుడు అని చెప్పింది గురువేనని అంటారాయన. దైవం కంటే మిన్నగా గురువును ఆరాధించే సంస్కృతి మనది. ఆదియుగం నుంచి ఆధునిక కాలం వరకు ఆచార్యుడే ఆరాధ్యుడు. మనకోసం మనం బతకటంలో గొప్పేముంది? ఇతరుల కోసం సమాజ హితం కోసం బతికితేనే కదా జీవితానికి అర్థం పరామార్థం అని ఉపాధ్యాయ వృత్తిని దైవకార్యంగా భావిస్తున్నారు కొంతమంది ఉపాధ్యాయులు.

ఇందిరానగర్ హైస్కూల్లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులంటే ఓ రకమైన అభిప్రాయం ఉంటుంది. ముఖ్యంగా సర్కార్ బడుల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు సంకోచిస్తుంటారు. కానీ సిద్దిపేటలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందుకు భిన్నం. పేరుకు ప్రభుత్వ పాఠశాల అయినా, కార్పొరేట్ విద్యను అందిస్తారు ఇక్కడి అధ్యాపక బృందం.



పాఠశాల గేటుకు ఏర్పాటు చేసిన నో అడ్మిషన్స్ ఫ్లెక్సీ (ఫైల్)

కొన్ని సంవత్సరాలుగా వందల్లో ఉన్న విద్యార్థులు వేలలోకి చేరారు. సామాన్య, మధ్యతరగతి వాళ్లే కాదు ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ఈ పాఠశాలకు పంపించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఒక్క స్కూలులోనే 58 మంది ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 12 మంది అధ్యాపక వృత్తిలో ఉన్న వాళ్ల పిల్లలు చదువుకుంటున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎల్లం ఇద్దరు పిల్లలు ప్రకృతి, కీర్తిక 6వ తరగతి చదువుతున్నారు. 8వ తరగతిలో ప్రధానోపాధ్యాయుడు సురేష్ కొడుకు విఘ్నేష్, మరొక ప్రభుత్వ పాఠశాల ఉద్యోగి కొడుకు లిఖిత్ ఉన్నారు. 9వ తరగతిలో సాంఘిక సంక్షేమ పాఠశాల అధ్యాపకురాలు రజిత కూతురు రూపశ్రీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న జగదీశ్వరాచారి కూతురు శ్రేష్ఠ, మోడల్ స్కూల్లో అధ్యాపకుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు కూతురు హర్షిని, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దత్తాద్రి కొడుకు సాయిచరణ్ చదువుతున్నారు. 10వ తరగతిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకట్ కొడుకు భార్గవ్‌రాజ్, మరో ప్రభుత్వ అధ్యాపకుడు దశరథం కూతురు అక్షర, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న హిమబిందు కూతురు ధనలక్ష్మి, ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ కూతురు వేదవిజ్ఞ ఉన్నారు. వీరే కాకుండా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారి పిల్లలు 58 మంది ఈ పాఠశాలలో చదువుతున్నారు. ప్రైవేట్ స్కూళ్లను కాదని ప్రభుత్వ బడిలో చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ఇందిరానగర్ అధ్యాపక బృందం సరైన ప్రణాళికలతో కార్పొరేట్ విద్యను విద్యార్థులకు అందిస్తున్నారు. పాఠశాల చదువు తర్వాత ఉన్నత చదువులు చదువుతూ కార్పొరేట్ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులతో పోటీ పడుతున్నారు.


డిజిటల్ క్లాసులు వింటున్న విద్యార్థులు



ఇందిరానగర్ పాఠశాల

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

- దశరథం, ప్రభుత్వ ఉపాధ్యాయుడు



నేను బడిబాటలో గ్రామాల్లోకి వెళ్లి పిల్లలను బడికి పంపాలని అడిగినప్పుడు మీ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతారు. మా పిల్లలను గవర్నమెంట్ బడికి పంపాలా? అని అడిగారు. నాకు నిజమే కదా అనిపించినా ఇద్దరు కూతుర్లను కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించా. నా కూతురు అక్షరను నేను పనిచేసే మర్రిముచ్చాల స్కూలులో 6,7,8 తరగతులు చదివించా. ఆ తర్వాత నాకు ట్రాన్స్‌ఫర్ అయ్యాక 9వ తరగతికి ఇందిరాగర్ స్కూలుకు మార్చాను. ప్రస్తుతం 10వ తరగతి చదవుతుంది. చదివే సత్తా ఉన్నవాళ్లు ఏ స్కూళ్లో అయినా చదువుతారనేది నా అభిప్రాయం.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నా వంతుగా..

- వెంకట్, ప్రభ్యుత్వ ఉపాధ్యాయుడు



ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి నా వంతు గా నా కొడుకును కూడా సర్కార్ బడిలోనే చదివించాలి అనుకున్న. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నేను పనిచేసే బద్దిపడగ దగ్గర ఊరతండా పాఠశాలలో చదివించా. 6వ తరగతి నుంచి ప్రస్తుతం పదవ తరగతి ఇందిరానగర్ స్కూలులో చదివిస్తున్న. తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల మీద నమ్మకం రావాలంటే ఉపాధ్యాయుల పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించాలి.

గర్వంగా ఉంది, బాధ్యత పెరిగింది

- ప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, ఇందిరానగర్ హైస్కూల్



ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులకు మా పాఠశాల విశ్వాసం కలిగిస్తుంటే గర్వంగా ఉంది. వారి పిల్లల భవిష్యత్‌ను మా చేతుల్లో పెట్టారు. దీంతో మరింత బాధ్యత పెరిగింది. వారికి అంచనాలకు తగ్గట్టుగా మా ఉపాధ్యాయ బృందం మంచి ప్రణాళికతో పని చేసి మంచి ఫలితాలను తీసుకొస్తాం

ఫీల్డ్ ఆఫీసర్ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలి


- అల్లాదుర్గం ఎస్‌బీఐ ఎదుట రైతుల ఆందోళన

అల్లాదుర్గం, సెప్టెంబరు 4: అల్లాదుర్గం ఎస్‌బీఐలోని ఫీల్డ్ ఆఫీసర్‌ను మరో బ్యాంకుకు డిప్యుటేషన్‌పై బదిలీ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపిస్తూ బుధవారం ఎస్‌బీఐ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. రుణమాఫీ కోసం తాము వ్యయప్రాయసలు ఓర్చి బ్యాంకుకు వస్తే ఫీల్డ్‌ఆఫీసర్ పెద్దశంకరంపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. రైతులు బ్యాంకు వద్ద క్యూ కడుతుంటే మరొక బ్యాంకుకు బదిలీ చేయడం ఏంటని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.



అల్లాదుర్గం ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు









హత్నూర మండలం కొన్యాలలో వర్షపు నీటిలో మునిగిన పత్తిపంట



బద్దిపడగ వద్ద సర్వీస్ రోడ్డు దాటుతున్న స్థానికులు



కంగ్టి మండలంలో కుప్పగా వేసిన చోటే మొలకెత్తుతున్న పెసర మెదలు

తీరని నష్టం

అన్నదాతలకు తప్పని కష్టం

కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. వాగులు, చెరువులు పొంగిపొర్లాయి. వరద ఉధృతికి రహదారులు కొట్టుకుపోయాయి. పలుచోట్ల ఇళ్లు.. కరెంటు స్తంభాలు కూలాయి. ఇక వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు నిలిచాయి. భారీ వర్షాలు.. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నదాతలకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. పత్తి పంటలు ఎర్రబారుతున్నాయి. ఇక పెసర, మినుము పంటలు మొలకెత్తుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటలు వర్షార్పణమవడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.

- భారీ వర్షాలకు పలు మండలాల్లో పొలాల మునక
- మొలకెత్తుతున్న పెసర, మినుము.. ఎర్రబారుతున్న పత్తి
- పలుచోట్ల పిడుగుపాటుకు గేదెలు మృతి, కూలిన ఇళ్లు
- ఆందోళనలో రైతాంగం..
- క్షేత్రస్థాయిలో కానరాని వ్యవసాయ అధికారులు!!

వటపల్లి/హత్నూర/కంగ్టి/మునిపల్లి/ఝరాసంగం/అక్కన్నపేట/హుస్నాబాద్/చేర్యాల/మిరుదొడ్డిసెప్టెంబరు4:వటపల్లి మండలంలో చేతికొచ్చిన మినుము పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. పంటలను బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. అత్యధికంగా మినుము, పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు అధికారులకు విన్నవించారు. నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని వారు కోరారు. హత్నూర మండలంలో పత్తి పంట పెద్ద మొత్తంలో దెబ్బతిన్నది. ఒంపు ప్రాంతాల్లో నీరు నిలిచి మొక్కలు కుళ్లిపోతున్నాయి. అయితే మిగతా మొక్కలకు తెగులు సోకే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ ధికారులు పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంటల సంరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కంగ్టి మండంలోనూ పలు గ్రామాల్లో పెసర, మినుము పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాశులు చేద్దామని పెసర పంట కోయగానే వర్షం ప్రారంభమైంది. రైతులు పెసర మెదళ్లను ఒకచోట వేసి తాటిపత్రి కవర్లతో కప్పి ఉంచారు. ఇప్పుడు చూస్తే పెసర మెదళ్లు మొలకెత్తాయి. దెగుల్‌వాడి గ్రామానికి చెందిన రైతుపోగులపీర్‌రెడ్డి మూడెకరాల్లో వేసిన పెసర పూర్తిగా మొలకెత్తింది. కంగ్టిలో కుర్రె మన్నారెడ్డి తన మూడెకరాల్లో వేసిన పెసర పనికి రాకుండాపోయింది. మునిపల్లి మండలంలో మొత్తం 38వేల ఎకరాల విస్తీర్ణం ఉండగా ఇందులో 32వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్నది. ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి, నర్సాపూర్, బొప్పన్‌పల్లి, మాచూనూర్, గుంతమర్పల్లి, చీలమామిడి, ఏడాకులపల్లి తదితర గ్రామాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టారు. వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతినడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇంత జరిగిన ఇప్పటి వరకు సంబంధితశాఖ అధికారులు వచ్చి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వలేదని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.



హుస్నాబాద్‌లో పిడుగుపాటుకు మృతిచెందిన గేదె



అక్కన్నపేట మండలం కేశవపూర్ గ్రామంలో..



బద్దిపడగ వద్ద పొలంలోకి చేరిన ఇసుక మేటలు



ఝరాసంగం మండలం మాచూనూర్ శివారులో నీట మునిగిన పత్తిపంట

కానరాని అధికారులు..!

ప్రభుత్వం దెబ్బతిన్న పంటలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినా మునిపల్లి మండల వ్యవసాయ అధికారులు రైతువేదికలకే పరిమితమయ్యారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. రూ.2లక్షలకు పైబడిన రుణమాఫీ విషయంలో పత్రాలు స్వీకరించడంలో ఏఈవోలు నిమగ్నమై ఉన్నారని చెబుతున్నారు. గత నెల మునిపల్లి ఏవో అనితారెడ్డి సస్పెండ్ అవ్వగా ఆమె స్థానంలో ఇంకా ఎవరికి బాధ్యత అప్పగించలేదు. పత్తి పంట పడిపోతున్న విషయం తమ దృష్టికి రాలేదని, తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏడీఏ సత్యనారాయణను తెలిపారు. ఒక్క మునిపల్లి అనే కాదు ఉమ్మడి జిల్లాలోని అనేక మండలాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

హుస్నాబాద్ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు సావు చంద్రయ్యకు చెందిన గేదె మృతి చెందింది. దాదాపు రూ.1.50లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. అక్కన్నపేట మండలం కేశవాపూర్‌లో పిడుగుపడి గన్నెబోయిన రాజేశంకు చెందిన గేదె మృతిచెందింది. గేదె మృతితో రూ.70 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.

కూలిన ఇళ్లు.. ఓ ఘటనలో మహిళకు తీవ్రగాయాలు

వర్షానికి పెంకుటిల్లు కూలి మహిళకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుబ్బారెడ్డి, భార్య, తల్లితో కలిసి జీవిస్తున్నాడు. పాత ఇల్లు కావడంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో తల్లి కౌసల్య కాలు విరిగింది. స్థానికుల సహాయంతో ఆమెను దుబ్బారెడ్డి కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. చేర్యాలలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన భూమిగారి జనార్దన్ ఇల్లు మంగళవారం రాత్రి నేల కూలింది. వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారడంతో జనార్దన్ కుటుంబీకులంతా బంధువుల ఇంట్లో నిద్రించడంతో ప్రాణాపాయం తప్పింది. మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ ముస్త్యాల తారయాదగిరి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో పరిశీలించారు. ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు.



నంగునూర్ వద్ద రోడ్డుపైకి నీళ్లు రావడంతో స్థానికుల తిప్పలు



భారీ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మోయతుమ్మెద వాగు వద్ద సర్వీసు రోడ్డు



భారీ వర్షానికి కోతకు గురైన మిట్టపల్లి సర్వీస్ రోడ్డు



మొలకెత్తుతున్న పెసర మెదలు

తేలుకాటుకు మహిళ మృతి



లావణ్య (ఫైల్)

మద్దూరు, సెప్టెంబరు 4 : తేలుకు కాటుకు గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మద్దూరు మండలం సలాఖ్‌పూర్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల మేరకు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడ్వటూర్‌కి చెందిన దండుగుల లావణ్య(26) సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం సలాఖ్‌పూర్‌లోని ఓ రైతుకు చెందిన పత్తిపంటలో కలుపు తీయడానికి ఆటోలో కూలీలతో కలిసి వచ్చింది. చేనులో కలుపు తీస్తుండగా ప్రమాదవశాత్తు తేలు కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు లావణ్యను మద్దూరులోని పీహెచ్‌సీకి, అక్కడి నుంచి చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భర్త మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రాయపోల్ మండలం ఎల్కల్‌లో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేయిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

రాయపోల్, సెప్టెంబరు 4: టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నప్పటికీ అక్రమ రేషన్ బియ్యం దందా ఆగడం లేదు. తాజాగా రాయపోల్ మండలం ఎల్కల్‌లో అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన పబ్బ మల్లేశం కిరాణాషాపులో సుమారు 70 బస్తాల బియ్యం దొరికినట్లు తెలిసింది. పట్టుబడిన బియ్యాన్ని బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కిలో అల్ప్రాజోలం పట్టివేత

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 4 : సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రం వద్ద 65వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం ఓ వ్యక్తి నుంచి 1.010 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నట్లు సంగారెడ్డి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎండీ నజీర్ పాష తెలిపారు. కంది వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా సదాశివపేటలోని హట్కర్‌పేటకు చెందిన మొమిన్‌పేట మహేష్ అనుమానాస్పదంగా నడుచుకుంటూ కనిపించాడన్నారు. అనుమానం వచ్చి అతన్ని తనిఖీ చేయగా 1.010 కిలోల అల్ప్రాజోలం పట్టుబడ్డట్లు తెలిపారు. పట్టుబడిన అల్ప్రాజోలం విలువ సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. సదాశివపేటకు చెందిన ప్రధాన సరఫరాదారుడు లింగన్నగారి రఘుగౌడ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు కె.దిలీప్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా భూములను కాపాడండి

- ఎంపీ డీకే అరుణను కలిసిన వక్ఫ్ భూబాధిత రైతులు



హైదరాబాద్‌లో ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న కోహీర్ వక్ఫ్ భూబాధిత రైతులు

కోహీర్, సెప్టెంబరు 4 : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలానికి చెందిన పలువురు వక్ఫ్ భూముల బాధిత రైతులు బుధవారం హైదరాబాద్‌లో జాయింట్ పార్లమెంట్ కమిటీ సభ్యురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. కొన్నేళ్లుగా వక్ఫ్ పేరుతో తమకు భూములను స్వాధీనం చేసుకున్నారని రైతులు ఆమె ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. తమ భూములు వక్ఫ్ పరిధిలో ఉన్నాయని, భూ క్రయవిక్రయాలు లేకుండా చేశారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను జాయింట్ పార్లమెంట్ కమిటీ ఎదుట వినిపించాలని వారు అభ్యర్థించారు. అనంతరం ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఎంపీ అరుణను కలిసిన వారిలో రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, వీరారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బోగ బస్వరాజ్, రవీందర్, బస్వరాజు స్వామి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మా సమస్యలు పరిష్కరించరూ..

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆరోగ్య మిత్రల విన్నపం

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 4: ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి విచ్చేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆరోగ్యమిత్రలు విన్నవించుకున్నారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు అందించాలనే ఉద్దేశంతో నియమించారని, అప్పటినుంచి ఎన్నో వ్యయ ప్రయాసలను ఓర్చి ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో ఆయుష్మాన్ భారత్ సేవలను కూడా అందించడంలో తమ పాత్ర కీలకంగా మారిందన్నారు. అయినా తమను పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇటీవలే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు సమ్మె నోటీసు ఇచ్చినపుడు వ్యాధుల కాలం దృష్ట్యా మానవతా దృక్పథంతో వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా ఉద్యోగులను డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలి, ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ వేడుకున్నారు. ఒకవేళ తమ సమస్యలు పరిష్కరించకుంటే త్వరలోనే పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అంతోళ్ల సురేష్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మం తదితరులు ఉన్నారు.



మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఉద్యోగులు

గజ్వేల్ మార్కెట్‌యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 4: గజ్వేల్ మార్కెట్‌యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా వంటేరు నరేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ నేపథ్యంలో సాదాసీదాగా బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకోగా, త్వరలోనే పెద్దఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, గజ్వేల్ మార్కెట్ యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లక్ష్యంగా కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. తమ నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి రుణపడి ఉంటామన్నారు. వారి మార్గదర్శకంలో వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని వివరించారు. కాగా వైస్ చైర్మన్‌గా సర్దార్ ఖాన్, డైరెక్టర్‌గా ఉప్పల శ్రీనివాస్‌గుప్త, సముద్రాల హరినాథ్‌గుప్త, మహంకాళి శ్రీనివాస్‌గుప్త, శ్రీనివాస్‌గౌడ్, నరసింహారెడ్డి, డాక్టర్ వహీద్, యాదయ్య, నల్ల భానుప్రియ, రామాగౌడ్, నర్సింలుగౌడ్, వెంకటస్వామిలు బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ పాలకమండలిచే బాధ్యతల స్వీకారం చేయించారు.



గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నరేందర్‌రెడ్డి



మంత్రి దామోదర రాజనర్సింహతో గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

మంత్రులను కలిసిన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని వారి నివాసంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలసి ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలువగా, వారు శుభాకాంక్షలు తెలిపారు.

గరీబోళ్లకు అన్యాయం చేస్తే సహించం

- హైడ్రాను స్వాగతిస్తాం..
- రాజకీయం చేసి పేదల ఇళ్లు కూల్చితే సహించబోం
- అనుమతులిచ్చిన వారిపై ముందు చర్యలు తీసుకోవాలి
- వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి
- మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు

దుబ్బాక, సెప్టెంబరు 4: 'కబ్జాకు గురైన భూములను రక్షిస్తామంటే సంతోషిస్తాం.. హైడ్రాను రాష్ట్రం మొత్తం జిల్లాల్లో అమలు చేస్తే మరీ సంతోషపడుతాం.. కానీ గరీబోనికి అన్యాయం చేసే పనిని తాము సహించబోం' అని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బడాబాబులకు విక్రయంచగా మిగిలిన కోకాపేటలోని భూములను పేదలకు పంచి, అందులో ఇళ్లు కట్టించిన తరువాతే హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదైన ఒక కేసు విషయంలో ఆయన బుధవారం దుబ్బాక మున్సిఫ్‌కోర్డుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్టు బయట విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అక్రమ కబ్జాలపై కొరడా ఝుళిపిస్తామంటే తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ దానివెనుక రాజకీయం చేసి, పేదల ఇండ్లను కూల్చివేస్తే తాము సహించబోమన్నారు. గరీబోళ్ల ఇండ్లు కూల్చివేయడం కంటే, వాటికి అనుమతినిచ్చిన అధికారులపై ముందు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాక తప్పుడు ధ్రువపత్రాలను చూసి, ఇంటిరుణం ఇచ్చిన బ్యాంకర్లపై చర్య తీసుకుని, వారి రుణం రద్దు చేయాలన్నారు. ముందుగా అధికారులు అనుమతినివ్వకుంటే, ఇలాంటి సమస్య తలెత్తేది కాదన్నారు. 30 ఏళ్ల నుంచి ఇళ్లు కట్టుకుని అక్కడే జీవిస్తున్న వారికి ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా కూల్చడం దారుణమన్నారు. అలాంటి గరీబోళ్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, కోకాపేటలో ఎకరా వందల కోట్లతో అమ్మిన స్థలం పోగా, మిగిలిన స్థలంలో పేదలకు ఇళ్లు కట్టించి, వారి ఇండ్లను కూల్చాలన్నారు. ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి లాంటి వాళ్లకు ఇంకా రిజిస్ట్రేషన్ కాలేదనీ, అలాంటి వారి స్థలం వెనక్కి తీసుకుని, వాటిలో వీరందరికి వంద, రెండువందల్లో ఇళ్లు కట్టించాలన్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలపై సకాలంలో ప్రభుత్వం స్పందించలేదన్నారు. దీని మూలంగానే వరద నష్టం, ప్రాణ నష్టం జరిగిందన్నారు. వర్షాలతో నష్టపోయిన రైతన్నను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరదలకు ధ్వంసమైన రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బాలేష్‌గౌడ్, బిక్షపతి, వెంకట్‌గౌడ్, కుమార్, యాదగిరి, ప్రవీణ్ తదితరులున్నారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని మహిళ మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

పూడూరు, సెప్టెంబరు1: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరులో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా బుదేరాకు చెందిన మన్నె రాంచంద్రయ్య, కూతురు లావణ్య(33), అల్లుడు కావలి వెంకటేశం బైక్‌పై వస్తున్నారు. పూడూరు గేటు వద్ద మరో ద్విచక్రవాహనం వీరి బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. లావణ్య, వెంకటేశం కిందపడిపోయారు. లావణ్య తలకు బలమైన గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. వెంకటేశం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



జహీరాబాద్: శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఆర్డీవో రాజు

వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో బుధవారం శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. వినాయక మండపాల వద్ద పాటించాల్సిన నిబంధనల గురించి పోలీసులు మండపాల నిర్వాహకులకు వివరించారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

జహీరాబాద్, సెప్టెంబరు 4: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జహీరాబాద్ ఆర్డీవో రాజు, డీఎస్పీ రామ్మోహనరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో వినాయక చవితిపండుగ సందర్భంగా శాంతి(పీస్)కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ వినాయచవితి నవరాత్రి ఉత్సవాలను భక్తులు శాంతియుతంగా జరుపుకోవాలని, ఇతరులను రెచ్చగొట్టే విధంగా, కించపరిచే విధంగా ఎవరైన వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేయరాదన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్‌శాఖ డీఈఈ లక్ష్మణ్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మాధవరెడ్డి, సీఐ శివలింగం, ఎస్ఐలు కాశీనాథ్, ప్రసాదరావు, రాజేందర్‌రెడ్డి, నాయకులు, మండపాల నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.


నారాయణఖేడ్: పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అశోక చక్రవర్తి

● హత్నూర: భక్తి భావంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం హత్నూర మండలం దౌల్తాబాద్ సమీపంలోని బీఎన్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శాంతి కమిటీ సమావేశం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్, డిప్యూటీ తహసీల్దార్ దావూద్ అహ్మద్, ఎంపీడీవో శంకర్, విద్యుత్ శాఖ అధికారి విజయ్‌కుమార్, ఇరిగేషన్ అధికారి వైష్ణవి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● వట్‌పల్లి: పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వట్‌పల్లి ఎస్ఐ లక్ష్మణ్ కోరారు. వినాయక చవితి పండగ సందర్భంగా మంగళవారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శాంబిరెడ్డి తదితరులు హాజరయ్యారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.


రేగోడు పోలీస్ స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం

● మునిపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రాజేష్ నాయక్ కోరారు. బుదేరా చౌరస్తాలోని ఎస్ గార్డెన్‌లో బుధవారం జరిగిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులను అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు.

● నారాయణఖేడ్: పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఆర్డీవో అశోక చక్రవర్తి సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో శాంతిసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా గణేష్‌ఉత్సవాలను నిర్వహించుకునేలా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలోస్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, తహసీల్దార్ భాస్కర్, ఉత్సవ కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

● రాయికోడ్: పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు పేర్కొన్నారు. బుధవారం రాయికోడ్‌లోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయాగ్రామాల వినాయక కమిటీసభ్యులతో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. మండపాల అనుమతికోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో ఎస్ఐ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది, మండలంలోని ఆయా గామాల వినాయక కమిటీసభ్యులు పాల్గొన్నారు.

● రేగోడు: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని రేగోడు ఎస్ఐ పోచయ్య సూచించారు. బుధవారం రేగోడు పోలీస్ స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని సూచించారు.

● శివ్వంపేట: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి సూచించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబి పర్వదినాల సందర్భంగా బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో శివ్వంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గణేష్ ఉత్సవకమిటీ నిర్వాహకులతో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు.

● వెల్దుర్తి: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని వెల్దుర్తి ఎస్ఐ రాజు సూచించారు. బుధవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ... గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలనికోరారు. తూప్రాన్‌లో

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

● అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మాసోత్సవం

తూప్రాన్, సెప్టెంబరు 4: తల్లులు పోషకాహారం, సమతుల ఆహారం చిరుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ శోభ పేర్కొన్నారు. తూప్రాన్‌లో బుధవారం పోషణ్ మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత వల్ల పిల్లల పెరుగుదల కుంటుపడితే జరిగే అనర్థాలపై వివరించారు. వైద్య సిబ్బంది దుర్గారెడ్డి, ఏఎన్ఎం రేణుక, వార్డు ఆఫీసర్ బాబురావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● నర్సాపూర్,సెప్టెంబరు 4: పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సమతుల ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ పుష్పలీల, ఏఎన్ఎం రోజారాణి, స్వప్న, అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, తల్లులు, గర్భిణులకు సమతుల ఆహారం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.


తూప్రాన్: పోషణ్ మాసోత్సవంలో ప్రసంగిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి

● చిన్నశంకరంపేట: బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తినాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ సూచించారు. బుధవారం మండలంలోని జంగరాయితండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు ఆరోగ్య సూచనలు చేశారు. బాలింతలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.


కొండాపూర్: మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో చంద్రకళ

కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఇందిర, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

● కొండాపూర్: మండల పరిధిలోని హరిదాస్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సీడీపీవో చంద్రకళ, సూపర్‌వైజర్ శ్యామల హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తీసుకునే ఆహారంలో పోషకాలు కలిగే ఆకుకూరలు, కూరగాయలను తినాలని సూచించారు. పలు రకాల జాగ్రత్తలపై అవగాహన కల్పించారు అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఏసుమణి, అనిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ


నల్లవల్లి గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

గుమ్మడిదల, సెప్టెంబరు 4: అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి శాస్త్రవేత్తల బృందంతో కలిసి బుధవారం మండలంలోని నల్లవల్లి గ్రామంలో మొక్కజొన్న, పత్తి కంది పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలు తగ్గిన తరువాత మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ రైతులందరూ కుటుంబ నిర్ధారణ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం గుమ్మడిదల రైతు వేదికలో రుణమాఫీకి సంబంధించి కుటుంబ సభ్యులు నిర్ధారణ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీ నగేష్, మల్లయ్య ఏడీఏ మనోహర, ఏవో శ్రీనివాసరావు, ఏఈవోలు నిఖిత, సాయికిరణ్, రైతులు శంకర్, వెంకటేశం పాల్గొన్నారు.

ఖాన్‌చెరువు తాత్కాలిక మరమ్మతులు

వెల్దుర్తి, సెప్టెంబరు 4: గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మండల పరిధిలోని ఎలుకపల్లి ఖాన్ చెరువులోకి భారీగా వర్షపు నీరు చేరి అలుగు పారుతుంది. దీంతో ఖాన్ చెరువు కట్ట తూమ్ వద్ద బుంగ పడింది. స్పందించిన ఇరిగేషన్ డీఈఈ రాజేందర్ ఆధ్వర్యంలో బుంగ పడిన కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది బాలు, ప్రవీణ్, మధు, రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి: సీఐ

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 4: భారీ వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రామాయంపేట సీఐ వెంకట రాజాగౌడ్ పేర్కొఅన్నారు. బుధవారం సీఐ చిన్నశంకరంపేట పీఎస్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరదల దృష్ట్యా ప్రజలు, చేపల వేటకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఒక రోజు వేతనం చెల్లించడం హర్షణీయం

నారాయణఖేడ్, సెప్టెంబరు 4: వరద బాధితులను ఆదుకునేందుకు టీజీఈఐకాస రాష్ట్ర నాయకత్వంలోని అన్ని సంఘాలబాధ్యుల నిర్ణయం మేరకు ఒక రోజు మూల వేతనాన్ని సీఎం సహాయనిధికి చెల్లించడం హర్షణీయమని టీపీటీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం ఖేడ్‌లో నిర్వహించిన సంఘంజోనల్ సమావేశంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘంజిల్లా ఉపాధ్యక్షుడు నాసర్ పటేల్, విజయభాస్కర్, అశోక్‌కుమార్, రాష్ట్ర, జిల్లా, స్థానిక బాధ్యులు, సంజీవయ్య, లక్ష్మయ్య, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్ అర్బన్, సెప్టెంబరు4: జిల్లా ప్రజల ఆకాంక్ష మేరకు మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలపాలని, ఆ దిశగా యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టాలని వైద్యఆరోగ్యశాఖ రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహకు టీఎన్జీవో, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నరేందర్, మహేందర్‌గౌడ్‌లు వినతి పత్రం అందజేశారు. జిల్లాను రాజన్నజోన్‌లో చేర్చడం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల గురించి మంత్రికి వివరించారు. కార్యక్రమంలో టీఎన్జీవో, ట్రెసా నాయకులు ఇక్బాల్‌పాషా, సిద్ధూ, పరమేశ్వర్, నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సునీతారెడ్డిపై విమర్శలు విడ్డూరం: బీఆర్ఎస్

నర్సాపూర్, సెప్టెంబరు 4: నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవకే అంకితమైన ఎమ్మెల్యే సునీతారెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక వ్యక్తిగత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్యనాయకులు పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగృహంలో రాష్ట్ర నాయకులు గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ నయీం, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, నాయకులు మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షులు అంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అధికార పార్టీ నాయకులుగా నియోజకవర్గం అభివృద్ధి కోసం పనిచేయకుండా ఎమ్మెల్యే సునీతారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. రాజకీయాల్లో ప్రజా సేవలో అవకాశాలను బట్టి ఎక్కడ సేవ చేసే అవకాశముంటే అక్కడకు వెళ్తారని అన్నారు. ఏనాడు కనీసం సర్పంచ్ కూడా కాని నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందినా అహంకారం పోలేదన్నారు. ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన హరీశ్‌రావుతో పాటు ఇతర నాయకులపై కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

బైక్‌పై నుంచి కింద పడి యువకుడి దుర్మరణం

పెద్దశంకరంపేట,సెప్టెంబరు 4: ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి కిందపడిన యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఉత్తులూరు గేటు వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాడ్చేట్‌పల్లి గ్రామానికి చెందిన కాయుత రమేష్(38) రాత్రి పెద్దశంకరంపేట నుంచి బైక్‌పై మాడ్చేట్‌పల్లికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఉత్తులూరుగేటు సమీపంలోకి చేరుకోగానే ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి కింద పడడంతో తలకుతీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో రమేశ్ అక్కడికక్కడే మృతి దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడిభార్య కాయుతస్వప్న ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, సెప్టెంబరు 4: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరీద్‌పూర్‌లో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ పట్టణం సుభాష్‌కాలనీకి చెందిన కొత్తోల్ల మల్లేశ్(51) బుధవారం మండలంలోని ఫరీద్‌పూర్ శివారులోని చెక్‌డ్యాంలో చేపలు పట్టేందుకు మరికొందరితో కలిసి వెళ్లాడు. చేపలు గట్టుమీది నుంచి తీసుకువస్తుండగా కాలుజారి డ్యాంలో పడ్డాడు. గమనించిన సహచరులు నీటిలోంచి తీసి మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు సందీప్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కోహీర్‌లో రెండు ఫర్టిలైజర్ దుకాణాల్లో చోరీ



దుకాణాల షెటర్లను ధ్వంసం చేసిన దొంగలు

కోహీర్ సెప్టెంబరు 4: మండల కేంద్రమైన కోహీర్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు రెండు ఫర్టిలైజర్ దుకాణాల షెటర్లను ధ్వంసం చేసి రూ.16 వేలను దొంగిలించారు. కోహీర్ ఏఎస్ఐ కిష్టయ్య వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి వర్షం కురుస్తున్న సమయంలో గుర్తు తెలియని ఇద్దరు దొంగలు కోహీర్‌లోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్ వద్ద ఉన్న శ్రీలక్ష్మీనరసింహ ఫర్టిలైజర్, మనగ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాల సెటర్లను ధ్వంసం చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్ దుకాణంలోకి చొరపడి దుకాణంలోని కౌంటర్‌లో ఉన్న రూ.16 వేలను దొంగిలించారు. మరో దుకాణంలో లాకర్ సదుపాయం ఉండడం వల్ల దొంగలు లాకర్‌ను తెరవలేకపోయారు. ఉదయం తెల్లవారుజామున విషయం తెలుసుకున్న దుకాణదారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దుకాణాలను పరిశీలించి, క్లూస్‌టీమ్‌ను రప్పించి దొంగతనానికి సంబంధించిన సీసీ ఫుటేజీలను పరిశీలించి, కేసు నమోదు చేశారు.

విధుల్లో భాగంగానే మహిళను ప్రశ్నించారు: భెల్ ఏజీఎం

రామచంద్రాపురం, సెప్టెంబరు 4: విధుల్లో భాగంగానే తమ సిబ్బంది అనుమానాస్పదంగా కనిపించిన మహిళను ప్రశ్నించారని బీహెచ్‌ఈఎల్(భెల్) ఏజీఎం (టౌన్‌షిప్ అడ్మిని స్ట్రేషన్) సూరన్ ప్రసాద్ తెలిపారు. గత నెల 29వ తేదీన శక్తి శ్రీనిధి, దినకరణ్ రాత్రివేళ ఓ క్వాటర్ వద్ద అనుమానాస్పదంగా కనిపిస్తే తమ సెక్యూరిటీ ఇన్‌చార్జి గణేష్, మరో సిబ్బంది నర్సింహులు వారిని ప్రశ్నించారన్నారు. దీంతో తమపై అసభ్యంగా ప్రవర్తించారంటూ శక్తి శ్రీనిధి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారని, శ్రీనిధి చేసిన ఫిర్యాదు సత్యదూరమని ఏజీఎం పేర్కొన్నారు. రాత్రివేళ టౌన్‌షిప్‌లోని క్వాటర్ నంబరు 16లో వారు అక్రమంగా ప్రవేశించారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో భెల్‌లో ఇతరులు ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఏజీఎం పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలను నివారించడంలో భాగంగానే ఆమెను ప్రశ్నించినట్లు తెలిపారు. సిబ్బంది విధులను నిర్వహించారే తప్ప అసభ్యంగా ప్రవర్తించలేదని ఏజీఎం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జగన్నాథ్ ఆదేశాల మేరకు ఎస్ఐ నర్సింహ కేసు దర్యాప్తు చేపట్టారు.

'బెదిరిస్తున్న రియల్టర్లపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 4 : తమ స్థలాలను ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమీన్‌పూర్ సొసైటీ భూముల్లో అధికారులతో పాటు రియల్టర్లు నకిలీ పత్రాలు సృష్టించి డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. సొసైటీ సభ్యుడు వైకుంఠవాసు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న సమయంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీంతో తాము హైకోర్టుని ఆశ్రయించగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించిందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వినతి పత్రం అందజేసి వారిలో సొసైటీ సభ్యులు కృష్ణమూర్తి, సత్యనారాయణ, మోహన్‌రెడ్డి, రమేష్, రమణరావు తదితరులు ఉన్నారు.

ఎద్దుమైలారం పాఠశాల నిర్వహణ తీరు భేష్: డీఈవో

కంది, సెప్టెంబరు 4 : ఎద్దుమైలారం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నిర్వహణ, బోధనా తీరు భేషుగ్గా ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు కితాబిచ్చారు. మండలపరిధిలోని ఎద్దుమైలారం జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో పరిసరాలు, ఉపాధ్యాయుల బోధనా పద్ధతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

సైబర్ క్రైం, డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

జహీరాబాద్, సెప్టెంబరు 4: యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఆచార్య డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సైబర్‌క్రైమ్ నివారణ, డ్రగ్స్ నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ తోటివారికి కూడా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగ ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సాజీద్, కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

● మెదక్ అర్బన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పట్టణ ఎస్ఐ రాజయ్య సూచించారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం షీ టీంలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో షీటీం కానిస్టేబుల్ విజయ్, కళాశాల కరస్పాండెంట్ శ్రీరాములు, ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమ కాలుష్యంపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు

జిన్నారం, సెప్టెంబరు 4: గడ్డపోతారం పారిశ్రామికవాడలో కాలుష్యం తీరుపై స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం పారిశ్రామికవాడలో ఓ పరిశ్రమ అవుట్‌లెట్ నుంచి వ్యర్థ జలాలను వదిలేశారని, ఇదే పరిశ్రమపై గత నెల 24న ఫిర్యాదు చేసినా, మళ్లీ వ్యర్థాలు వదిలేశారని నాయకులు సత్యనారాయణ, బాలయ్య ఫిర్యాదు చేశారు.

కౌడిపల్లిలో చెరువులో మంత్రి పూజలు

కౌడిపల్లి, సెప్టెంబరు 4: కౌడిపల్లి పెద్ద చెరువులో ఆరోగ్యశాఖా మంత్రి రాజనర్సింహ బుధవారం పూజలు చేశారు . ఈ సందర్భంగా ముందుగా మీని ట్యాంక్‌బండ్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి పూజలు చేశారు. మంత్రి వెంట మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డితో పాటు మహ్మద్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, నాయకులు చిన్నంరెడ్డి, శివాంజనేయులు, అధికారులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగ నేపథ్యంలో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని ముత్యాలమ్మ, భారాహిమామ్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ జావేద్ తెలిపారు.

'టీచర్లకు బోధనేతర పనులు వద్దు'

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 4: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కల్పించవద్దని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డి మండలం కొత్లాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఉపాధ్యాయులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వల్ల సమయం తగ్గుతుందని దీని ద్వారా విద్యార్థులకు సిలబస్ పూర్తి కాదన్నారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సింహాచలం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలు నిలిచి అవస్థలు

తూప్రాన్, సెప్టెంబరు 4: తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లి వద్ద హల్దీవాగుపై నిర్మించిన కాజ్‌వే దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కాజ్‌వే దెబ్బతినడంతో రోడ్డుకు అడ్డుగా కందకం తీసి మట్టి పోశారన్నారు. కాజ్‌వే దెబ్బతినడంతో పది గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలపారు.

కూలిన ఇళ్లకు పరిహారం

రేగోడు సెప్టెంబరు 4: వర్షానికి పాక్షికంగా కూలిన ఇళ్లకు నష్టపరిహారం మంజూరైందని తహసీల్దార్ బాలలక్ష్మి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 13 ఇళ్లు వర్షాలకు పాక్షికంగా కూలినట్లు గుర్తించామని, అందులో ఐదు ఇళ్లకు నష్టపరిహారం మంజూరైందని తెలిపారు. మంజూరైనా చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

వరదలను కూడా రాజకీయం చేస్తున్న కాంగ్రెస్


● వరదబాధితులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నెల జీతం విరాళం


విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి


మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 4: రాష్ట్రంలో భారీ వర్షాలను కూడా కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు సునితాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలు సంభవించే ముందు జాతీయ విపత్తు సంస్థ సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ముందస్తు చర్యలు చేపట్టకపోవడంవల్లే ప్రమాదం తీవ్రరూపం దాల్చిందన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్‌పార్టీ బాధితులకు అండగా చేయూతనిచ్చేందుకు, నిత్యావసర సరకుల పంపిణీకి మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, ఇతర నేతలు ఖమ్మం వెళ్లి ఇంటింటికి వెళ్లి సరుకులను అందజేశారన్నారు. అదే సమయంలో కలిసికట్టుగా రావాల్సిన అధికార కాంగ్రెస్ తమ పార్టీ నేతలతో బీఆర్ఎస్ నాయకులపై దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు నామమాత్రంగా పర్యటిస్తే, బీఆర్ఎస్ నేతలు ఇంటింటికి వెళ్లి సరుకులను అందజేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. మరోసారి ఇటువంటి దాడులకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. ఓ మంత్రి దేవుడిపై భారమనడం.. మరో మంత్రి పక్క రాష్ట్రం నుంచి హెలిక్యాప్టర్ తెప్పిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. నీటమునిగిన పంటల నష్టపరిహారం కింద రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు సునితాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలు తమ నెల జీతాన్ని వరద బాధితుల సహాయార్థం ప్రకటించారు. సమావేశంలో జడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్ జయరాజ్, నాయకులు ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: ఖేడ్ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, సెప్టెంబరు 4: విద్యార్థులుచదువుతో పాటుసాంకేతిక రంగంలోనూ రాణించాలని, విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడిఉందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఖేడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండునెలల ఉచిత కంప్యూటర్ శిక్షణను ఆయన ప్రారంభించి, సరస్వతీ పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వార్థం వదిలితేనే మార్పు, అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతిదానికి ప్రభుత్వంపై ఆధారపడకుండా శ్రమదానంతో చిన్నచిన్నపనులు చేసుకోవడం విద్యార్థిదశనుంచే అలవర్చుకోవాలన్నారు. ఒక్కో పాఠశాలకు 8 చొప్పున కంప్యూటర్లను వితరణ చేసి ఉచిత శిక్షణ నివ్వడం పట్ల ఫౌండేషన్ చైర్మన్‌పాడి శెట్టి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ సూర్య, ఇతర బాధ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఖేడ్‌లో కంప్యూటర్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పాతాళగంగలో లక్ష బిల్వాల నిమజ్జనం


పాతాళగంగలో త్రిదళ బిల్వాలను నిమజ్జనం చేస్తున్న రాచన్న స్వామి ఆలయ బృందం

కోహీర్, సెప్టెంబరు 4: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల శ్రీ రాచన్న స్వామి ఆలయంలో గత నెల రోజులపాటు జరిగిన స్వామివారి లక్ష బిల్వార్చన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. నెల రోజులపాటు పూజించిన బిల్వపత్రాలను బుధవారం ఆలయ ఈవో శివ రుద్రప్ప, అర్చక బృందం శ్రీశైలంలో పూజలు నిర్వహించి పాతాళగంగలో నిమజ్జనం చేశారు.

● గుమ్మడిదల, సెప్టెంబరు 4 : మండలం బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయాన్ని బుధవారం హరిద్వార్ ఆనంద్ వన్ ఆశ్రమపీఠాధిపతి స్వామి విష్ణు దేవానంద్ జీ సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బొంతపల్లి గ్రామ ఆలయ పురోహితులు వలివేటి కిరణ్ కుమార్‌శర్మ స్వాగతం పలికారు. అనంతరం స్వామి విష్ణు దేవానంద్ జీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వలివేటి సురేష్ కుమార్ శర్మ, ముక్కాల శంకర్ గుప్తా, మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయకుమార్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

● శివ్వంపేట, సెప్టెంబరు 4: మండల పరిధిలోని గూడూరు పురాతన సోమేశ్వరాలయంలో బుధవారం ఆలయ పూజారి రాజశేఖర్ శర్మ అభిషేకం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు సహకరించాలి

శివ్వంపేట, సెప్టెంబరు 4: ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైందని, ఉన్నతస్థాయికి చేరిన పూర్వ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూతను అందించాలని ఎంఈవో బుచ్యానాయక్, లయన్స్‌క్లబ్ ఆఫ్ బాలానగర్ ఇలైట్ 320బి జిల్లా గవర్నర్ రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకుని బుధవారం దొంతి ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ బాలానగర్ ఇలైట్ 320 బి ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు విశ్వనాథ్ లింగోజి స్మారకార్థం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన కుమారులు బాలానగర్ ఇలైట్ చైర్ పర్సన్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సేవాపురస్కారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుచ్యానాయక్, రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వడ్ల వెంకటేశం, రాజిరెడ్డి, రామకృష్ణయ్య, మాణిక్యం గురువులను పూర్వ విద్యార్థులు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల అదనపు గది నిర్మాణానికి గ్రామానికి చెందిన చిగుళ్లపల్లి కుటుంబీకులు తరఫున చిగుళ్లపల్లి కృష్ణ రూ.11 లక్షల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో కృషి గ్రామీణ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు, ముత్యాలు, తాటి శ్రీనివాస్, పెరక వెంకటేష్, యాదగిరి, పూర్వ విద్యార్థులు, విరామ ఉపాధ్యాయులు, 1976-77, 78-79 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు ఉన్నారు.


విశ్రాంత గురువులకు సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు